మహిళాభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: మహిళాభ్యున్నతికి తన వంతు సహకారం ఉంటుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన సందర్భంగా బుధవారం బేగంపేట మయూరిమార్గ్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత అభినందన సభలో మహిళలు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళాభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే సమాజ వికాసం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఫలించిన ఆందోళన.. తొలగిన ఆక్రమణ



ఫెన్సింగ్ రాడ్లను తొలగింపజేసిన మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: బేగంపేట బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్–8లో కొంతమంది రోడ్డును ఆక్రమిస్తూ వేసిన ఫెన్సింగ్ రాడ్లను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బుధవారం తొలగించారు. రోడ్డును ఆక్రమిస్తున్నారంటూ ఎయిర్‌లైన్స్ అపార్ట్‌మెంట్‌వాసులతో పాటు స్థానికులు మంగళవారం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. రోడ్డు ఆక్రమణకు చర్యలు పాల్పడడంపై ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరిని అక్కడికి పంపించి వెంటనే రోడ్డు ఆక్రమణ కోసం వేసిన ఫెన్సింగ్ రాడ్లను తొలగింపజేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో కార్పొరేటర్ మహేశ్వరి, బీఆర్‌ఎస్ నేత శ్రీహరి అక్కడకు చేరుకుని టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో ఫెన్సింగ్ రాడ్లను తొలగింపజేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అడ్డగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని సీనియర్ నాయకులు ఎస్. యాదగిరి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మరో రెండింటిని అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం అడ్డగుట్ట అంజయ్య విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలవుతాయన్నారు. ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ, సునీత, లలిత, లక్ష్మి, కమల, అరుణ, అర్జున్, యాదగిరి, సాలమ్మ, రాణి, చిలుకమ్మ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.9, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 57, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 26, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 19, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 15, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఫుట్‌పాత్ ఆక్రమణలు.. అక్రమ పార్కింగ్‌లపై ఉక్కుపాదం

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రణాళికలు
- సాక్షితో ఉత్తర మండలం ట్రాఫిక్ నూతన ఏసీపీ జి. శంకర్ రాజు



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిర్దిష్టమైన కార్యచరణతో ముందుకు సాగుతున్నాం. ఎక్కడ కూడా ట్రాఫిక్‌తో వాహనచోదకులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ జామ్ అయిన రోడ్లు, ప్రాంతాల్లో తమ సిబ్బంది వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నార్త్‌జోన్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్(ఏసీపీ) జి. శంకర్ రాజు పేర్కొన్నారు. బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో పని చేసిన శంకర్ రాజు బదిలీపై వచ్చి ఇటీవల సికింద్రాబాద్ ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ నిబంధనలు, ఉల్లంఘిస్తే చేపట్టే చర్యలు, రాకపోకలు సాఫీగా సాగే ప్రణాళికలపై ఆయన సాక్షితో వివరించారు.

ప్రశ్న: లష్కర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏసీపీ: ఉత్తర మండలంలోని సికింద్రాబాద్ ఏరియా పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలతో ముందుకు సాగుతున్నాం. సమస్య ఉత్పన్నమైన ప్రాంతాల్లో గంటల తరబడి రోడ్లపై వాహనాలు నిలువకుండా వెంటనే తమ సిబ్బందిని రంగంలోకి దించి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ట్రాఫిక్ వల్ల ప్రజలు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: నో ఎంట్రీ గురించి వివరించండి..

ఏసీపీ: ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో భారీ వాహనాలను రోడ్లపై అనుమతి ఇవ్వడం లేదు. దీనివల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం అంటే ఉద్యోగులు విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారితో ఉదయం 8 గంటల సమయంలో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. ఆ సమయంలో భారీ వాహనాలకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అనుమతి లేదు. ఇందు కోసం ప్రధాన చౌరస్తాలు, రహదారుల్లో నోఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: ఉత్తర మండలంలో ట్రాఫిక్ కార్యకలాపాల గురించి..

ఏసీపీ: ఉత్తర మండలం ట్రాఫిక్ పరిధిలో గోపాలపురం, మహంకాళి, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, బేగంపేట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఈ పరిధిలో ఎక్కడ కూడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా పకడ్బందీ కార్యకలాపాలతో ముందుకు సాగుతున్నాం. ముఖ్యంగా ఆయా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు ఇతరత్రా సిబ్బంది రోడ్లపై ఉంటూ ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తుంటారు. ట్రాఫిక్ పట్ల ప్రజలకు ముందస్తు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ట్రాఫిక్ శిక్షణ కేంద్రం నుంచి నేరుగా ట్రాఫిక్ నియంత్రణ విభాగానికి రావడం ఎలా ఉంది?

ఏసీపీ: విధి నిర్వహణలో భాగంగా అనేక చోట్ల పని చేయాలి. ట్రాఫిక్ శిక్షణ కేంద్రం నుంచి ట్రాఫిక్‌ను నియంత్రించే శాఖకు రావడం తన బాధ్యతను మరింత పెంచింది. అదే విధంగా సంతోషంగా కూడా ఉంది. టీచింగ్ నుంచి ప్రాక్టికల్ వైపు వచ్చినట్లు ఉంది. ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఏ విధానాన్ని అమలు చేయాలి, వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా చేపట్టే చర్యలపై ఎక్కువగా దృష్టి సారించడానికి వీలవుతుంది.

ప్రశ్న: నార్త్‌జోన్ పరిధిలో ట్రాఫిక్ జామ్ ఉండే రోడ్లు, ప్రాంతాలేవి.. సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?

ఏసీపీ: తమ పరిధిలో అనేక చౌరస్తాలతో పాటు జంక్షన్‌లలో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా సంగీత్ చౌరస్తా, ప్యాట్నీ చౌరస్తా– బైబిల్ హౌస్, ఆర్పీ రోడ్డు, బేగంపేట్, ఆలుగడ్డ బావి, తిరుమలగిరి చౌరస్తా, కార్ఖానా, బోయిన్‌పల్లి అంబేడ్కర్‌చౌరస్తా, ప్యారడైజ్, ఎంజీ రోడ్డు, మెట్టుగూడ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉంది. అయితే సదరు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నాం. జనసంచారం ఎక్కువగా ఉండే మోండా మార్కెట్ ఏరియాలో ట్రాఫిక్ సులువుగా ఉండే విధంగా చర్యలు చేపట్టాం. అక్కడి ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడబండ్ల నిర్వాహకులు, వ్యాపారస్తులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చాం.

ప్రశ్న: అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏసీపీ: రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ గంటలు, రోజుల తరబడి పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రోజుల తరబడి ఉన్న వాహనాలను సీజ్ చేస్తున్నాం. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తున్నాం. పాదచారులు రాకపోకలు సాగించడానికి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వ్యాపార కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. దీంతో పాదచారులు రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముందుగా సదరు వ్యాపారులకు అవగాహన కల్పించి వినకుంటే సదరు ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: డ్రంకెన్ డ్రైవ్ తీరుతెన్నుల గురించి..

ఏసీపీ: ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. తాగి వాహనాలను నడపడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీని వల్ల అనేక మంది గాయాలకు గురికావడంతో పాటు మృత్యువాత పడుతున్నారు. ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్ కారణంగా సికింద్రాబాద్ పరిధిలో చాలా వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి.

రెజ్లింగ్‌లో బల్కంపేట వాసి సత్తా



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

అమీర్‌పేట: నగరంలో జరిగిన శివాజీ కేసరి రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో బంగారు పతకం సాధించిన బల్కంపేట నివాసి పి.వి జయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో 86 కిలోల విభాగంలో సత్తా చాటాడని శ్రీ వీరహనుమాన్ వ్యాయామశాల నిర్వాహకులు రాజేశ్వర్‌రాజు తెలిపారు. విజయ్ ఇదే వ్యాయామశాలలో చాలా కాలం నుంచి శిక్షణ తీసుకుంటున్నారన్నారని రాజేశ్వర్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, టీవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

నివాళి



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ పాలక మండలి సభ్యుడు, బీజేఆర్‌నగర్–2 అధ్యక్షుడు అనిల్‌కుమార్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అనిల్‌కుమార్ నివాసానికి వెళ్లి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శేషుకుమారి, కూతురు నర్సింహా, కట్ట బల్‌రాం, సంతోష్,లక్ష్మి నివాళి అర్పించారు.

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ నాయకులు, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, బీజేఆర్‌నగర్–2 బస్తీ అధ్యక్షులు అనిల్‌కుమార్ మృతి చెందడం పట్ల ఆయన భౌతికకాయాన్ని బుధవారం బీజేపీ రాష్ట్ర యువనాయకులు మర్రి పురురవరెడ్డి సందర్శించి నివాళి అర్పించారు.

ముగిసిన ప్రతిష్ఠాపన మహోత్సవం



అడ్డగుట్ట: అడ్డగుట్ట సీ–సెక్షన్‌లోని మార్కండేయ సహిత శివ పంచాయతన దేవాలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం బుధవారం ముగిసింది. తెల్లవారుజాము నుంచి సుప్రభాత సేవ, గురు ప్రార్థనలతో పాటు వివిధ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభ, ఆత్మలింగం, పార్వతి, నందీశ్వర, గణపతి, కుమారస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన కార్యక్రమం ఆచార్యులు రఘుకిరణ చార్యులు, ఇతర వేదపండితుల సమక్షంలో వైభవంగా జరిగాయి. సాయంత్రం 4 గంటల నుంచి పార్వతి పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డగుట్ట, తుకారాంగేట్, వారాసిగూడ ప్రాంతాల్లో నుంచి భక్తులు పెద్ద ఎత్తున ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరై పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న దంపతులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జ ప్రవీణ్, బొడ్డు సంతోష్, రామకృష్ణ, యాదగిరి, మహేష్, తిరుపతి, రాజేశం, బొమ్మ నరేందర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



రాంగోపాల్‌పేట్: చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహం ప్రాంతంలో ఓ వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం మేరకు పోలీసులు వెళ్లి ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కాసేపటికి మరణించింది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని సుమారు 80 నుంచి 85 వయస్సు ఉంటుందని సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712660248 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు కంటోన్మెంట్‌లో విజయ సంకల్ప యాత్ర



వివరాలు వెల్లడిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర గురువారం కంటోన్మెంట్‌లో కొనసాగనుందని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ అన్నారు. బుధవారం బోర్డు కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో భారతదేశం ప్రపంచంలో ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమం అందిస్తూనే, అభివృద్ధిలో అగ్రదేశాలతో పోటీ పడుతున్నామంటే అది నరేంద్రమోదీ ఘనతేనన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ముగిసిన సైన్స్ ఎగ్జిబిషన్

రసూల్‌పురా: మూడు రోజుల పాటు బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జరిగిన సైన్స్ డే ఎగ్జిబిషన్ బుధవారంతో ముగిసింది. చివరి రోజు ఎన్‌ఆర్‌ఎస్‌సీ రిటైర్డ్ శాస్త్రవేత్త డా. చంద్రశేఖర్ ఇస్రో చేపట్టిన చంద్రయాన్ ద్వారా చంద్రగ్రహ రహస్యాలు, ఎన్‌ఆర్‌ఎస్‌సీ పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించారు. సీసీఎంబీ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డా. బిశ్వజిత్ పాల్ భూత భవిష్యత్ వర్తమాన కాలల్లోని విజ్ఞాన ఆవిష్కారాల గురించి వివరించారు. మొదటి రోజు నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్ జీడిమెట్ల, ఇర్విన్, భారతీయ విద్యా భవన్, సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల, నిజాం కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సేయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు విజేతగా నిలిచారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయాలి

లాలాపేట: సైంటిఫిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ ఆజాద్, సైంటిఫిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ నేషనల్ కోఆర్డినేటర్ చార్వాక హాజరై మాట్లాడారు. మానవ సమాజాభివృద్ధికి సర్ సీవీ రామన్ వంటి ఎంతో మంది శాస్త్రవేత్తలు ఎన్నో త్యాగాలు చేశారని, వారి త్యాగ ఫలితమే నేడు సమాజం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. సమాజంలోని మూఢనమ్మకాల నిర్మూలన కోసం ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాబాలు, స్వామిజీలు అమాయక ప్రజలను ఎలా మోసం చేస్తారో విద్యార్థులకు వివరించారు.

చిట్టి బుర్రలు.. చక్కటి ఆలోచనలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి





నమూనాలతో చిన్నారులు



తయారు చేసిన నమూనాల గురించి వివరిస్తున్న విద్యార్థులు



సనత్‌నగర్: జాతీయ వైజ్ఞానిక దినోత్సవ సందర్భంగా సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు 70 నమూనాలను రూపొందించి వాటి పనితీరును వివరించారు. వాటర్ ఫిల్టర్, 3డీ టీవీ, జేసీబీ మోడల్, నిప్పును ఆర్పే యంత్రం తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి.

బోయిన్‌పల్లి పాఠశాలలో..

కంటోన్మెంట్: విద్యా బోధనలో ప్రాక్టికల్స్ కీలకం కావాల్సిన అవసరం ఉందని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను డిప్యూటీ ఈఓ బాలునాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు నమూనాలను తిలకించారు. విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ రావు, బోయిన్‌పల్లి ఎస్‌ఐ శివశంకర్, రాజేశ్వరి, సుధ, రవి, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రం వద్ద ట్రాఫిక్ నియంత్రిస్తున్న దృశ్యం

సనత్‌నగర్/అమీర్‌పేట/చిలకలగూడ : ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 'ఒక్క నిమిషం' నిబంధన ఉండడంతో విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు పరీక్షా ప్రారంభం ఉండగా 8 గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకోవడంతో సందడి నెలకొంది. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని సనత్‌నగర్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిలకలగూడ ఠాణా పరిధిలోని సీతాఫల్‌మండి శ్రీసాయి విద్యావికాస్, పద్మారావు నగర్‌లోని శ్రీసాయి విజ్ఞానభారతి కళాశాల పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 7.30 గంటలకే విద్యార్థులు చేరుకున్నారు. చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కరుణాకర్‌ల నేతృత్వంలో ఆయా పరీక్ష కేంద్రాలు, చౌరస్తాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.



విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్న ఉపాధ్యాయుడు





సమయం మించిపోతుండటంతో పరుగులు తీస్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కిక్కిరిసిన రోడ్డు



పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థినులు



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



సీతాఫల్‌మండి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి